క్లుప్తంగా

ఎన్‌ఆర్‌ఐలను కలవండి..పలకరించండి



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డిని సత్కరిస్తున్న సంతోష్‌కుమార్‌రెడ్డి, మురళి

అల్లిపురం: ఎన్‌ఆర్‌ఐలను కలవండి..పలకరించండి.. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాలు), మాజీ పార్లమెంట్ సభ్యుడు ఎం.జ్ఞానేంద్రరెడ్డి బుధవారం రాత్రి సింగపూర్‌లో ఎన్‌ఆర్‌ఐలతో సమావేశమయ్యారు. సింగపూర్‌లో ఆయన ఎన్‌ఆర్‌ఐతో కలసి ఎన్‌ఆర్‌ఐల ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలను ఎన్‌ఆర్‌ఐలకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎన్‌ఆర్‌ఐ కో ఆర్డినేటర్లు పిల్లి సంతోష్‌కుమార్‌రెడ్డి, మురళి, ఎస్‌టీఎస్ మాజీ అధ్యక్షుడు కోటిరెడ్డిలు పాల్గొని ఆయనను సత్కరించారు.

రేపు షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



షిర్డీ సాయిబాబా

మహారాణిపేట: స్థానిక అంగడి దిబ్బలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయ ఆవరణలో ఉన్న శ్రీశ్రీశ్రీ షిర్డీ సాయిబాబా లక్ష్మీగణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, కార్యదర్శి వై.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఒమ్మి కిషోర్ తెలిపారు. శనివారం ఉదయం నుంచి శ్రీ షిర్డీ సాయిబాబకు విశేష అర్చనలు, క్షీరాభిషేకాలు, నారికేళ అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ షిర్డీ సాయినాథుని కృపకు ప్రీతిపాత్రులు కావాలని ఆయన కోరారు.


కార్పొరేటర్ సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కార్పొరేటర్ ముహ్మద్ సాథిక్

జగదాంబ: ముస్లిం యువతికి కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ ఆర్థిక సాయం అందించారు. జీవీఎంసీ 39వ వార్డులో సెయింట్ ఎలోషిస్ స్కూల్ వద్ద ఉన్న ఓ ముస్లిం కుటుంబం ఆర్థికంగా ఇబ్బందిపడుతుండడంతో కార్పొరేటర్ మహ్మద్‌సాధిక్ స్పందించి వెంటనే రూ.పదివేలు సాయం అందజేశారు.

రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలకు సిద్ధం



రక్షణగిరి పుణ్య క్షేత్రం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో రక్షణగిరి పుణ్యక్షేత్ర ప్రధాన మహోత్సవం మే 14న నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ తెలిపారు. ప్రతిఏటా ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఫాదర్ దుగ్గింపూడి బాలశౌరీ చేత పతాకావిష్కరణతో ప్రారంభమవు తుందన్నారు. శనివారం నుంచి 14వ తేదీ వరకు జరిగే వేడుకల్లో జపమాల, దివ్యబలిపూజతో పాటు ధ్యానాంశాలు బోధిస్తారన్నారు వెల్లడించారు. శుక్రవారం నవదిన ప్రార్థనలతో రక్షణగిరి పుణ్య క్షేత్ర మహోత్సవాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పేదల అ'డ్రెస్'

- పాత దుస్తులకు మెరుగులు
- మురికివాడల్లో జోరుగా విక్రయాలు
- పేదలకు చౌకగా దుస్తులు

దాబాగార్డెన్స్ : జీవితం కొందరికి అనుకోని వరం. కొందరికి మాత్రం మోయలేని భారం. పగలూ, రాత్రి వంటి, బొమ్మా బొరుసూ వంటి పరస్పర విరుద్ధమైన జీవితాలు గడుపుతున్న వారికి సౌకర్యాల విషయంలో ఎంతో వ్యత్యాసం. ఆహారంలో, దుస్తుల్లో ఈ అంతరాలు విస్పష్టం. ఉన్నవాడు కొత్త వస్త్రాలతో పండగ చేసుకుంటే..లేనివాడు పాత దుస్తులకు మెరుగులద్దుకుని సంబర పడతాడు. ఇలాంటి వారి కోసం పాతనగరంలో పాత డ్రెస్‌లు అమ్మకానికి లభిస్తున్నాయి.

వస్త్రాల కోసం పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయలేని నిరుపేదల కనీస అవసరాలు తీరుస్తున్నాయి. పాత దుస్తుల దుకాణాలు వారికి అందుబాటు ధరల్లో లభిస్తుండడంతో బడుగు జీవులంతా ఈ దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం పూర్ణామార్కెట్ చేపల బజార్‌ను ఆనుకుని ఏర్పాటు చేసిన దుకాణాల్లో పాతదుస్తులను అమ్మేవారు. కానీ అక్కడ సదుపాయాలు లేకపోవడంతో వారంతా నగరంలో తలా ఒక చోట వ్యాపారాన్ని చేసుకుంటున్నారు.

దొరికేదిలా..

ప్రతి ఇంట్లో వాడని దుస్తులను వివిధ రకాలుగా ఉపయోగిస్తుంటారు. కొంతమంది పేదవారికి దానం చేస్తుంటారు. మరి కొంతమంది స్టీలు సామాన్లకు మారువేస్తారు. ఇలా స్టీలు సామాన్లకు బదులు పాత దుస్తులను కొనేవారి నుంచి పాత వస్త్రాల వ్యాపారులు దుస్తులను సేకరిస్తారు. ప్యాంట్లు, షర్టులు, చీరలు, టీ షర్టులు, చుడీదార్లు ఇలా అన్ని రకాల దుస్తులను అమ్మకానికి సిద్ధం చేసుకుంటారు. ఎక్కడైనా చిరుగులు ఉంటే మిషన్‌పై కుట్టు వేసి ఇస్త్రీ చేస్తారు. ఈ దుస్తులను ఎక్కువగా పేదలు నివసించే మురికివాడ ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ఫిషింగ్ హార్బర్, జ్ఞానాపురం, పోర్టు ఏరియా, చెంగల్రావుపేట, సీహార్స్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసి అమ్ముతుంటారు. సాధారణంగా కూలీ పనులు, పెయింటింగ్, సెంట్రింగ్ చేసే కార్మికులు, చేపల వేట



ఫిషింగ్ హార్బర్ రోడ్డులో పాత దుస్తులు విక్రయిస్తున్న చిరువ్యాపారి

చేసే పేద మత్స్యకారులు, మెకానిక్‌లు, రిక్షా కార్మికులు వీటిని అధికంగా కొనుగోలు చేస్తుంటారు. ఇవి చాలా చౌకగా లభించడంతో పాటు మన్నిక బాగుంటుందని వినియోగదారులు అంటారు. నగరంలోనే గాక పాడేరు, చింతపల్లి, ముంచింగిపుట్టు వంటి గిరిజన ప్రాంతాలకు కూడా తీసుకువెళ్లి వారపు సంతల్లో విక్రయిస్తుంటామని వ్యాపారులు చెబుతున్నారు. కొనే వారికి స్తోమత లేకపోవడంతో లాభాల గురించి ఆలోచించమని చెప్పారు. కార్మికులకు కూలీ సొమ్ము అందిన రోజున, ఫిషింగ్ హార్బర్‌లో జీతాల రోజున అమ్మకాలు బాగుంటాయని తెలిపారు.

30 ఏళ్లుగా ఇదే వ్యాపారం

ముప్పై ఏళ్లుగా ఇదే వ్యాపారం చేస్తున్నాను. మరో పని రాదు. ఈ వ్యాపారాన్నే నమ్ముకుని జీవిస్తున్నాను. లాభాలు అంతగా ఉండవు. ఇది వరకులా పాత బట్టలు సేకరించడం కూడా కష్టంగానే ఉంది.

–నిర్మల, పాత దుస్తుల వ్యాపారి

కొత్తవి కొనాలంటే ఇబ్బందే..

నాకు వచ్చే ఆదాయంతో కొత్త దుస్తులు వేసుకునే అవకాశం తక్కువ. నేను చేసే పనికి పాత దుస్తులే సరైనవి. పెయింటింగ్ పనులు చేసే నాకు కొత్త దుస్తులు పనికిరావు. జీతం అందినప్పుడు వచ్చి షర్టులు, ప్యాంట్లు కొంటాను.

–సతీష్, పెయింటర్

శివాజీ సేవలు స్ఫూర్తిదాయకం



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: కరోనా సమయంలో మృతి చెందిన ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యులు ఏపీఎస్ శివాజీ రెండో వర్ధంతిని ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రామ్‌నగర్ లయన్స్ క్లబ్ భవనం నందు ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి ఉపాధ్యాయులంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శివాజీ జ్ఞాపకార్థం ఉపాధ్యాయులు రక్తధానం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇమంది పైడిరాజు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యుడిగా, డీసీఈబీ సెక్రటరీగా పనిచేసిన శివాజీ విద్యారంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మంచి మిత్రుడు, విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన శివాజీ కరోనా బారిన పడి అందరికీ దూరం కావటం ఎంతో బాధాకరమన్నారు. శివాజీను స్మరించుకునేలా సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఈబీ సెక్రటరీ ఎంవీ. కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్. సన్యాసిరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ. దేముడుబాబు, రామిరెడ్డి, కోశాధికారి శ్రీధర్, సోమేశ్వరరావు, భాస్కర్, స్వామి నాయుడు, రామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో 44 మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్‌806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు బోదిలపాటి సత్య రూపవాణి, ఎస్‌ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, వి. మారుతీప్రసాద్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



మృతిరాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



దూడ రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్ దుర్గమాంబ సేవా సంఘంలో నివశిస్తున్న ఎండ ఈశ్వరరావు హార్ట్ స్ట్రోక్ కారణంగా కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉందని, వైద్యం కోసం ఆర్థిక సహాయం కావాలని అతని భార్య కోరిన మేరకు ఎమ్మెల్యే స్పందించి తన సొంత నిధుల నుంచి వైద్య ఖర్చుల కోసం రూ.5వేలు అందజేశారు. అదే ప్రాంతానికి చెందిన సచివాలయ గృహసారథి రేగిడి కనకమహాలక్ష్మి గత వారం మృతిచెందగా రూ.5వేలు సాయం అందజేశారు. యల్ల శ్రీను ఫిట్స్‌తో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా మెరుగైన వైద్యం కోసం రూ.5వేలు అందజేశారు. 39వ వార్డు చిలకపేటకు చెందిన దూడ రాజు అనారోగ్యంతో నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయనకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు అధ్యక్షుడు అలపున కనకరెడ్డి, వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పార్టీ నాయకులు లింగం శ్రీను, లండా రమణ, ఎర్రబిల్లి ప్రభాకర్, గౌరీశంకర్, కండిపిల్లి వరలక్ష్మీ, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నృసింహావతారంలో బల్లిగిరి వెంకన్న



నృసింహావతారంలో బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: గురువారం నృసింహ జయంతి సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి నృసింహావతారంలో దర్శనమిచ్చారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జాము నుంచి బారులు తీరారు. నృసింహ జయంతి పురస్కరించుకుని ఆలయానికి భక్తులు తాకిడి పెరిగింది. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, సహస్రనామాభిషేకాలు చేపట్టారు. స్వామి వారికి మామిడి పండ్లను నివేదించారు.

నేడు చక్రస్నానం

కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం బల్లిగిరి దేవాలయం ఆవరణలో చక్రతీర్థం, వసంతోత్సవం, పూర్ణాహుతి, తిరుమంజన సేవ, అష్టోత్తర శత కలశ స్నపనం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రఘునాథాచార్యులు తెలిపారు.

ప్లాస్టిక్ ఉపయోగిస్తే చర్యలు



చిరువ్యాపారుల నుంచి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

జగదాంబ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌ఓ ఎస్.కిశోర్ అన్నారు. గురువారం ఆయన జోన్ పరిధిలో పర్యటించారు. చిరువ్యాపారులు దుకాణాలను పరిశీలించారు. వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ అమ్మినా..ఉపయోగించిన చర్యలు తప్పవన్నారు. మానవాళికి హాని కలిగించే ప్లాస్టిక్ ఉపయోగించకూడదని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అయినప్పటికీ వ్యాపారులు చేస్తున్న అమ్మకాలు వలన చిరువ్యాపారులు ఉపయోగిస్తున్నారన్నారు. హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు ముమ్మరం చేస్తామన్నారు. ప్లాస్టిక్ అమ్మకాలు చేపడితే వారిపై అపరాధ రుసుముతో పాటు దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అవసరం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

మద్దిలపాలెం: లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని సీపీఎం నగర కార్యదర్శి జగ్గునాయుడు అన్నారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అదాని డేటా సెంటర్ ఏర్పాటుతో వేలాది ఉద్యోగాలు యువతకు రానున్నాయని సీఎం చెబుతున్నారని, అయితే ఇప్పటికే ఉపాధి, ఉద్యోగాల కల్పతరువుగా ఉన్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. ప్లాంట్ విక్రయానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు దేశ, రాష్ట్ర ఆర్థిక పురోగతికి మూల స్తంభాలని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరమం ఎంతైన ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు నిరసన చేస్తుంటే అడ్డుకోవడం, అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఆర్కే ఎస్వీ కుమార్, కె.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



జనతాబజార్ వద్ద గొయ్యి

జగదాంబ : అండర్ గ్రౌండ్ డ్రెయిన్ చుట్టూ గొయ్యిగా ఏర్పడి ప్రమాదంగా తయారైంది. జీవీఎంసీ 35వ వార్డు జనతాబజార్ చేపల మార్కెట్ వద్ద ఉన్న ఓ యూజీడీ డ్రైన్ చుట్టూ గొయ్యిగా ఏర్పడింది. దీంతోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు గొయ్యి మరింత పెద్దగా మారింది. దీంతో పోర్టుకు, వన్‌టౌన్‌కు వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ క్షణంలో అయిన యూజీడీ కిందకు దిగిపోతే ప్రమాదం తీవ్రతరం అవుతుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే చేపల మార్కెట్ వ్యాపారులు ప్రమాదం ఉందంటూ తెలియజేయడానికి థర్మకోల్ షీట్ డబ్బాలను అడ్డంగా పెట్టారు. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి యూజీడీ చుట్టూ ఉన్న గొయ్యిని పూడ్చాలని కోరుతున్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా..



సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన మహిళలు

దాబాగార్డెన్స్: మహిళా సాధికారతే లక్ష్యంగా స్కిల్ హబ్స్‌లో పలు కోర్సులు ఏర్పాటు చేయడం జరిగిందని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి తెలిపారు. 3 నెలల బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్ కోర్సు పూర్తి చేసుకున్న 60 మంది మహిళలకు గురువారం కళాశాలలో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్థిరపడాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్స్ ద్వారా అనేక మంది మహిళలకు పలు కోర్సుల్లో శిక్షణ ఇచ్చామన్నారు. దీనిలో భాగంగానే బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులు నిర్వహించామని చెప్పారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభించామన్నారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలో గల పలువురు మహిళలు ప్రభుత్వ మహిళా కళాశాలలో శిక్షణ పొంది, సర్టిఫికెట్ అందుకున్న వారిని ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ సాయికృష్ణ చైతన్య అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఏజీఓ డాక్టర్ కె సుధా, ట్రైనర్ ఏ పావని, ఏపీఎస్‌ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ కె ప్రశాంతి, గోపాలరావు పాల్గొన్నారు.

ఆ డీపీఆర్‌లో మార్పులు, చేర్పులు చేయాలి



మాట్లాడుతున్న వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్)లో పలు మార్పులు, చేర్పులు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ డిమాండ్ చేశారు. గురువారం ఫిషింగ్ హార్బర్‌లోని మరపడవల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో లోపాలు ఉన్నాయని చెప్పారు. రూ.151.81 కోట్లతో డీపీఆర్ రూపొందించినప్పటికీ ఆయా పనులు సాగరమాల ప్రాజెక్టు కింద చేపడుతున్నారని, ఈ పనుల వల్ల మత్స్యకారులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. మత్స్యకారుల జీవన భృతి కోసం ఉండే ఈ ప్రాజెక్టు మత్స్యకారులకు కనీస అవసరాలు తీర్చడం లేదన్నారు. ఇందులో పోర్టు ట్రస్టు రూ.25 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.51.81 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు, ఒక కార్పొరేట్ సంస్థ రూ.25 కోట్లు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం చేపట్టి ఉంటే సముచితంగా ఉండేదన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని ముఖ్యంగా బోట్ల మరమ్మతులకు బీచ్ ల్యాండింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని జానకీరామ్ తెలిపారు. ఫింగర్ జెట్టీని నిర్మించాలని డిమాండ్ చేశారు. అదనపు వసతులు నిర్మించాలని, తవ్వేసిన రోడ్డు తిరిగి పునర్‌నిర్మించాలని కోరారు. సముద్రంలో మునిగిపోతున్న బోట్లను బయటకు తీసేందుకు తగిన సౌకర్యం కల్పించాలని కోరారు. చేపల వేలానికి సంబంధించి ఓపెన్ ఆక్షన్ హాల్ నిర్మించాలన్నారు. ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి ఏ మాత్రం సహకరించని మత్స్యశాఖలో కొంత మంది అధికారులను బదిలీ చేయాలని డిమాండ్ జానకీరామ్ డిమాండ్ చేశారు. కోస్టల్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్రి కొండబాబు మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్‌లో రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని దీంతో హార్బర్ కటిక చీకటి తాండవిస్తోందని చెప్పారు. మురుగునీటి పారుదల సౌకర్యం లేకపోవడం దురదృష్టకరమన్నారు. వైశాఖి డాల్ఫిన్ బోటు ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వీర్రాజు మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రమరపడవల సంఘం ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, పలు బోటు సంఘాల నాయకులు గంటు దానయ్య, దూడ పోలయ్య, గనగళ్ల రాజేష్ పాల్గొన్నారు.

మైనర్‌ను రక్షించిన లైఫ్ గార్డ్స్

అల్లిపురం: బీచ్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలికను బీచ్ లైఫ్ గార్డ్స్ రక్షించారు. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరానికి చెందిన మైనర్ ఒకరు ఉదయం నొవోటెల్ హోటల్ వద్ద బీచ్‌లోకి నడుచుకుంటూ వెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నించగా అక్కడే ఉన్న లైఫ్ గార్డ్స్ రాజు, కల్యాణ్, పోలిరాజులు రక్షించి మహారాణిపేట పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి, తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రేమ వ్యవహారం కారణంగానే బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు.

ఇస్కాన్‌లో వైభవంగా నరసింహ చతుర్దశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిర్‌లో గురువారం నరసింహ చతుర్దశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామి దర్శనం, 8గంటలకు హారతి, గురుపూజ నిర్వహించారు. శ్రీ రాధా దామోదరులను వివిధ రకాల పువ్వులు, ఆభరణాలు, ప్రత్యేక దుస్తులతో అలంకరించారు. అనంతరం శ్రీ రాధా దామోదరులను ప్రత్యేకంగా చందనంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 10 గంటలకు లోక కల్యాణార్థం నరసింహ యజ్ఞం, సాయంత్రం కీర్తనలు, నరసింహస్వామికి అభిషేకం చేశారు.

అబ్బురపరుస్తున్న రాంబో సర్కస్



సర్కస్‌లో విన్యాసం

బీచ్ రోడ్డు: ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాల ప్రదర్శనలతో రాంబో సర్కస్ నగర వాసులను అలరిస్తోంది. సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రం వేదికగా ప్రదర్శిస్తున్న రాంబో సర్కస్‌కు నగర వాసుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. 45 మంది కళాకారులు 20 ప్రదర్శనలతో ప్రేక్షకులను అబ్బురపరుస్తున్నారు. ఆదివారం వరకు ఈ రాంబో సర్కస్ ప్రదర్శనలు అందుబాటులో ఉండనున్నాయి.

గృహసారథులు, కన్వీనర్లకు సన్మానం



గృహసారథులు, కన్వీనర్లను సత్కరిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: గృహసారథులు, కన్వీనర్లకు జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఘనంగా సన్మానించారు. గురువారం వార్డు కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతం చేసిన వీరిని అభినందించారు. సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నాయకుడు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని తెలుసుకునేందుకు ప్రజల వద్దకు వెళ్లింది లేదని, అలా వెళ్లిన ఒకే ఒక్క పార్టీ వైఎస్సార్‌సీపీ అని అన్నారు. తొంభై శాతం హామీలన్నీ నేరవేర్చిన నాయకుడు మా జగనన్న అన్నారు. ప్రజాసేవలో గృహసారథులు, కన్వీనర్లు ఉండాలన్నారు. అనంతరం వారికి విల్లూరి నిత్యవసర వస్తువులు అందజేవారు. ఈకార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.